క్లుప్తంగా

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



పి.గన్నవరంలో వెలసిన వీరన్నబాబు గద్దె

పి.గన్నవరం: స్థానిక గొల్లల వీధిలోని గుండుబోగుల సూర్యనారాయణ నివాసంలో వెలసిన బాల వీరన్నబాబు గద్దెలో శనివారం వైభవంగా సంబరం నిర్వహించారు. వందలాది మంది భక్తులు గద్దెలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. తొలుత బాల వీరభద్రస్వామిని మేళతాళాలతో గ్రామంలో బాణసంచా కాల్చుతూ ఊరేగించారు. గరుడేశ్వర స్వామి ఆలయం వద్ద సూర్యనారాయణ, దేవుడమ్మ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్దఎత్తున అన్నసమారాధన చేశారు. రాత్రి శూల సంబంరం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనులు చేయాలి



తొండవరంలో ఉపాధి హామీ కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సరోవర్

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనలు, కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ జీవీ సరోవర్ ఉపాధి హామీ కూలీలకు వివరించారు. తొండవరం, వాకలగరువు గ్రామాల్లో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. రైతులకు ఉపయోగపడే పంట బోదెలు తదితర వాటిని గుర్తించి పనులు చేయిస్తున్నామన్నారు. అనంతరం మస్టర్ కాపీలను, పనుల ప్రతిపాదన పత్రాలను ఎంపీడీఓ పరిశీలించి మేట్లకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ సరోవర్ వెంట ఉపాధి ఏపీఓ ఏవీ కృష్ణారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఘనంగా శాంతి హోమాలు

మామిడికుదురు: బి.దొడ్డవరంలో ఉమా సోమేశ్వరస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శనివారం పలు ప్రత్యేక పూజలు జరిపించారు. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, మూలమంత్ర జపాలు, హోమాలు, నిత్యోపాసన, బలిహరణ పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ పూజల్లో కంభంపాటి సుబ్రహ్మణ్య శ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకటరామ నాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. పంచ శయ్యాధివాసం, హోమాలు, శాంతి హోమం, దిశా హోమం, తదితర పూజలను వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

సాహిత్య పఠనంపై అవగాహన పెంచుకోవాలి



బాల మందిరం కార్యక్రమంలో విద్యార్థులతో రచయిత కృష్ణశ్రీ

ఆలమూరు: విద్యార్థులందరూ మాతృభాషపై మమకారం పెంచుకుని సాహిత్య పఠనంపై అవగాహన పెంచుకోవాలని సాల్కే ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, ప్రముఖ కవి, రచయిత అంగర గోపాలకృష్ణచార్యులు (కృష్ణశ్రీ) అన్నారు. మండలంలోని సందిపూడిలోని ఎంపీయూపీ పాఠశాలలో శనివారం బాలమందిరం సాహిత్య కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు సాహిత్య పఠనం, కథా వస్తువు తయారీ, భాషా నైపుణ్యం నాటకీకరణ, గేయ రచనలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన కల్పించుకున్న విద్యార్థులే రచయిత చెప్పిన కథాంశాన్ని ఆధారంగా చేసుకుని రచనలు చేసుకున్న విధానం అందరినీ ఆకట్టుకుంది.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు-2, కలవచర్ల, పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, మోదుకూరు, మడికి, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిప్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, కో ఆర్డినేటర్ గన్నవరపు



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

పి.గన్నవరం: ఎన్నికల్లో ప్రకటించిన సూపర్-6 హామీలను అమలు చేయకుండా మోసగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం పి.గన్నవరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఈనెల 5న అమలాపురంలో జరుగనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, మెల్లం మహలక్ష్మి ప్రసాద్, మందపాటి కిరణ్‌కుమార్, యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, సాధనాల రమేష్, దాసరి కాశీ, కొంబత్తుల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు పోరు' ద్వారా ప్రభుత్వాన్ని నిలదీస్తాం

మామిడికుదురు: ఫీజు రీయింబర్సుమెంట్ అమలు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై ఈ నెల 5న ఫీజు పోరు పేరిట ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామని పి.గన్నవరం నియోజకవర్గం వైసీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము అధ్యక్షతన కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఫీజు పోరు ద్వారా ప్రభుత్వాన్ని నిలదీస్తామని శ్రీనివాసరావు చెప్పారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం వాటిని అమలు చేయకపోవడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఫీజు పోరు ఆందోళనకు పార్టీ శ్రేణులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్యకుమార్, జక్కంపూడి వాసు, నెల్లి దుర్గాప్రసాద్, గెడ్డం మంగాదేవి, జాలెం అనూష, తోరం సూర్యభాస్కర్, మొల్లేటి త్రిమూర్తులు, తులా గోపాలకృష్ణ, అన్వర్ తాహిర్ హుస్సేన్, కదలి శ్రీను, చేట్ల రామారావు పాల్గొన్నారు.

స్వామిని చూసి.. మది మురిసి



అప్పనపల్లిలో బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: ఆ శ్రీనివాసుడిని చూసి ప్రతి మది మురిసింది.. పవిత్ర మాఘ మాసం శనివారం కావడంతో అప్పనపల్లి శ్రీబాల బాలాజీ క్షేత్రం భక్తులతో శోభిల్లింది. తొలుత పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని స్వామివారిని వేడుకున్నారు. నిత్యం జరిగే లక్ష్మీ నారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.3,08,503 ఆదాయం వచ్చిందని ఈఓ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. అన్నదాన ట్రస్టుకు రూ.93,017 విరాళాలుగా భక్తులు సమర్పించగా, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.67,350 వచ్చిందన్నారు. 4,800 మంది స్వామివారిని దర్శించుకుని, 2,700 మంది అన్న ప్రసాదం స్వీకరించారని వివరించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి



చింతలూరులో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేషపూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం



వాడపాలెంలో దేవతామూర్తుల రూపంలో విద్యుత్ సెట్టింగ్

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బండారు వారి ఆడపడుచుగా విరాజిల్లుతున్న సత్తెమ్మతల్లి ఆరో వార్షికోత్సవ జాతర మహోత్సవాలు నాలుగు సంవత్సరాల అనంతరం జరుగుతున్నాయి. ఆది నుంచీ ఉత్సవ నిర్వాహకుడు చింతపల్లి బాలు, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి, కట్టా శ్రీను తదితరుల ఆధ్వర్యంలో స్థానికులు, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికుల సహకారంతో భారీ ఖర్చుతో ఉత్సవాలు చేపట్టారు. గ్రామ ముఖద్వారం బస్టాండ్ నుంచి వానపల్లి రోడ్డు, మార్కెట్, సుభాష్‌చంద్రబోస్ విగ్రహం, బజారు వీధి, అమ్మవారి ఆలయం గుండా తిరిగి బస్టాండ్ వరకూ భారీ ఎత్తున విద్యుదీకరణ, వివిధ రకాల సెట్టింగులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలతో గ్రామం కొత్త కళతో కళకళలాడుతుంది. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆద్యంతం కనుల విందుగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డికి పీహెచ్‌డీ



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

రావులపాలెం: గోదావరి నదిలో రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశ్రామిక, గృహ కాలుష్యంపై చేసిన అధ్యయనానికి భూపాల్‌కు చెందిన ఎస్ఆర్‌కే యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ ఇచ్చినట్టు గ్రామానికి చెందిన పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి(గీతాంజలి వాసు) శనివారం తెలిపారు. పీహెచ్‌డీ డాక్టరేట్ పొందిన శ్రీనివాసరెడ్డికి పలువురు గ్రామ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఘనంగా రజకుల బల్లల పండగ

రావులపాలెం: గ్రామంలోని పంచాయతీ వెనుక రజకులపేటలో శనివారం బల్లల పండగలు ఘనంగా నిర్వహించారు. వారి కులదైవాన్ని హంస వాహనంపై ఊరేగింపు నిర్వహించారు.

వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం

అంబాజీపేట: మాచవరం గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్, సీపీఐ నాయకుడు నేలపూడి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు కొనియాడారు. అంబాజీపేటలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు స్వగృహం వద్ద వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి, నిరుపేదల సంక్షేమానికి వెంకటరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. అంతకుముందు వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డు అభివృద్ధి పనులను పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం పరిశీలించారు. మూడు రోడ్ల సెంటర్ నుంచి బాలాజీ థియేటర్ వరకూ జరిగిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఆయన తిలకించారు. రోడ్డును నాణ్యతతో నిర్మించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రావులపాలెం: స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు నాటక ప్రదర్శన నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

ఎల్ఈడీ టీవీలు, ఇన్వర్టర్ల బహూకరణ



అంతర్వేదిపాలెం పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌కు టీవీ బహూకరిస్తున్న రమేష్

సఖినేటిపల్లి: రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలంలోని 7 అంగన్‌వాడీ సెంటర్లకు శనివారం ఓఎన్జీసీ పరిధిలోని సిటిజన్ ఫౌండేషన్ ఎల్ఈడీ టీవీలు, ఇన్వర్టర్లు బహూకరించింది. పల్లిపాలెం, కేశవదాసుపాలెం గ్రామాల్లో రెండేసి సెంటర్లకు, అంతర్వేదిపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో ఒక్కో సెంటర్‌కు చొప్పున వీటిని ఫౌండేషన్ ఆర్గనైజర్ రమేష్ అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి, సర్పంచ్ కొండా జాన్‌బాబు, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఓ వ్యక్తిని ఐదు లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన మార్గన సత్యనారాయణను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన బూల మోహన్, ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామానికి చెందిన జి.రాములు వద్ద 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 8 స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు.

సామాజిక జీవన స్థితిగతులపై అధ్యయనం



పినపళ్లలో సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేస్తున్న ప్రత్యేక బృందం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో శనివారం సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులు, ఆలయాల విశిష్టత, గ్రామ చారిత్రక నేపథ్యంపై అధ్యయనం జరిగింది. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి డాక్టర్ రవికుమార్ నేతృత్వంలో ఆరుగురు బృందం గ్రామానికి చేరుకుంది. సర్పంచ్ సంగిత సుభాష్, గ్రామ కార్యదర్శి ఎస్.వీరరాజు సహకారంతో గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి వివరాలను సేకరించింది. అన్ని కులాలకు సంబంధించి 20 కుటుంబాలను కలసి గత 25 ఏళ్ల నుంచి గుర్తున్న సమగ్ర సమాచారాన్ని సేకరించి నివేదికను పొందుపర్చుకుంది. గ్రామ రెవెన్యూ అధికారి బుంగ ఉదయ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, ఏఎన్ఎం కె.వెంకాయమ్మ, మహిళ సంరక్షణ కార్యదర్శి కె.లక్ష్మీ నారాయణమ్మ, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మౌనిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభజన జరిగిన తరువాత ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గ్రామాలకు సంబంధించి సమగ్రమైన వివరాలు లేకపోవడంతో ఈ అధ్యయనం చేపట్టినట్లు ప్రత్యేక అధికారి రవికుమార్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మార్చి నెలాఖరు నాటికి సామాజిక స్థితిగతులపై సర్వేను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో ఆర్థిక స్థితిగతులపై వివరాలు సేకరించేందుకు సహకరించిన గ్రామస్తులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ రాజబాబు

మలికిపురం: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు సూచించారు. మలికిపురం పంచాయతీ వద్ద శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ పథకంలో వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కూడా కూడా వెంటనే జమ అవుతుందన్నారు. అలాగే వినియోగదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేసి వెంటనే బిల్లు చెల్లిస్తుందన్నారు. ద్వారా బ్యాంకు రుణాన్ని ఈజీగా తీర్చుకోవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఈ పథకంలో 12 జంటలను ఎంపిక చేసి రిపబ్లిక్ డే పరేడ్‌కు ప్రభుత్వం ఖర్చులతో పంపగా ప్రధాని మోదితో భేటీ అయ్యారని ఆయన అన్నారు. మలికిపురంలో గ్రామానికి టార్గెట్ ఇచ్చామని టార్గెట్ రీచ్ అయితే గ్రామానికి కోటి రూపాయల గ్రాంట్ వస్తుందని, దాంతో గ్రామం అభివృద్ధి అవుతుందన్నారు. సమావేశంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, భారత ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ దొడ్డా నాగబాబు, డీఈ టెక్నికల్ విజయానంద్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ బి.ప్రసాద్, ఎంపీటీసీలు జక్కంపూడి శ్రీదేవి, కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, నాయకులు గెద్దం తులసీ భాస్కరరావు, ఇందుకూరి అచ్యుత రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్



పాలూరి సత్యానందం

కొత్తపేట: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మరోసారి తనదైన మార్కు చూపిస్తూ వరుసగా ఎనిమిదోసారి అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్ ప్రవేశపెడుతూ దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని 5 అంశాలతో బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. వృద్ధిని వేగవంతం చేయడం, సమగ్ర అభివృద్ధి, ప్రైవేటు రంగ పెట్టుబడులు, కుటుంబ మనోభావాలను పెంచడం, భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి వ్యయశక్తిని పెంపొందించడం, దేశంలో వెనుకబడిన జిల్లాల్లో ధన్ ధాన్య యోజనతో వ్యవసాయానికి పెద్ద పీట, రైతులకు తీపికబురు కిసాన్ క్రెడిట్ కార్డులు 3 లక్షల నుంచి5 లక్షల వరకు పెంపు, మహిళలకు శుభవార్త, పదికీలక రంగాలపై త్వరిత, సమ్మిళిత అభివృద్ధి, పెట్టుబడుల సాధన లక్ష్యంగా బడ్జెట్ ఉంది. ఇన్‌కంటాక్సుపై భారీ ఊరట 12 లక్షల వరకు పన్ను మినహాయింపు వంటి అంశాలు అందరికీ ఆమోదయోగ్యమైనవని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవృద్ధి మందగించినా భారత్ మెరుగైన పనితీరు సాధించిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇండియా శాసించే స్థాయికి భారత్ ఎదుగుతుందని పాలూరి తెలిపారు.

మెజీషియన్ అలీని సన్మానించిన హాస్యనటులు



మెజీషియన్ అలీ సన్మాన సభలో పాల్గొన్న బ్రహ్మానందం, సినీనటులు

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన అంతర్జాతీయ మెజీషియన్ అలీ శనివారం ప్రముఖ హాస్యనటుల ద్వారా సన్మానం అందుకున్నారు. ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బ్రహ్మానందం స్వగృహంలో ఈ సన్మానం జరిగింది. అక్టోబరు 20న కేరళలో జరిగిన జాతీయ మ్యాజిక్ ఫెస్టివల్‌లో బెస్ట్ మెజీషియన్ అవార్డు అందుకోవడం గర్వకారణమని బ్రహ్మానందం పేర్కొన్నారు. ఇండియా నంబర్‌వన్ మెజీషియన్ అలీ అని అభినందించారు. బ్రహ్మానందం స్వయంగా గీసిన షిర్డీ సాయిబాబా చిత్రాన్ని అలీకి బహూకరించారు. ఈ సన్మానంలో హాస్యనటులు అలీ, గౌతమ్, జబర్దస్త్ హాస్యనటులు పాల్గొన్నారు.

డీఐజీ మృతికి సంతాపం

మలికిపురం: ఇటీవల మృతి చెందిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాదవత్తుల శివరామ్‌కు మలికిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. సబ్ రిజిస్ట్రార్, వి.వేంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ వి.అరుణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, ఆఫీసు సిబ్బంది, మలికిపురం దస్తావేజులు లేఖరులు కోళ్ళ రాంబాబు, కంచుస్తంభం వాసు, మురళీ కృష్ణ సహాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.